# కొద్దికథలు

## వడ్డీవ్యాపారం

ఒక వ్యాపారస్తుడు తక్కువమొత్తాలు అప్పుతీసుకొని ఎక్కువ వడ్డీని ముట్ట జెపుతూవుండేవారు. ఈ విషయం కొద్ది రోజుల్లోనే ఊరంతా బాగా ప్రాకిపోయింది. ఇక ప్రతివారూ పదీ,పాతికా, వందా, యాభైలూ తెచ్చి ఆ వడ్డీవ్యాపారస్తునిముందర పోసేస్తూ, తమ గడువు తీరిపోగానే, ఎక్కువ వడ్డీతో తమ మొత్తాల్ని తీసుకొనేవారు.

ఈ సంగతి వూళ్ళోవున్న సెట్టిగారికి గూడా తెలిసింది. సెట్టిగారు బ్లాకు మార్కెటులో వేలకువేలు గడించాడు. అందువల్ల డబ్బు దాచుకొనేందుకు ఆలోచించి తనదగ్గరున్న డబ్బంతా గూడా వడ్డీకిగాని యిచ్చేమంటె, ఇంకా ఆదాయం పెరుగుతుందని ఆశపడి, శెట్టిగారు గూడా తనదగ్గరున్న పదివేల రూపాయలు నగదుకాక తన భార్య మెళ్ళోని నగలుసైతం అమ్మి, మొత్తం ఆ వడ్డీవ్యాపారస్తుని కాళ్లముందు పోసేడు.

ఆ వ్యాపారస్తుడు పెట్టిన షరతు ప్రకారం ఆరు మాసాల గడువు తీరిపోయింది. అంచేత పెందలాడే సెట్టిగారు బయల్దేరి వడ్డీవ్యాపారస్తుని యింటికి వెళ్ళాడు. తాళం వేసుంది. అతడు ఇంటిఅద్దయినా యివ్వకుండా ఉడాయించాడని ఆ ఇంటి యజమాని చెప్పాడు. దాంతో సెట్టి నిలువునా నీరైపోయాడు.

"రమణ్"

## ముగ్గురు జూదరులు

ముగ్గురు జూదరులు జూదమాడిరి. అందొకడు పూర్తిగా వోడిపోయి తక్కిన యిద్దరు జూదరులకు సొమ్ము బాకీ పడెను. సొమ్ము యిచ్చి కదలవలసినదని వారతని నిర్బంధముజేసిరి. ధనహీనుడైన యా జూదరి వారి బారినుండి తప్పించుకొను నుపాయములేక కొంతసేపు విచారించి వారిట్టటు జూచుచుండగా గుప్పెడిసుకదీసి వారి కన్నులలో గొట్టి గబగబ పారిపోయెను. వారిద్దరు గన్నులలో ఇసుక దుడుచుకొని కొంత విశ్రాంతిజెంది తమకు సొమ్ము బాకీపడిన దొంగజూదరిని వెదకుటకై మరల బయలుదేరిరి. సందులు, గొందులు వెదకిరి. కాని వారికెందును గానరాలేదు. చిట్టచివరకు వారు విసుగుజెంది యొక మామిడితోటలోనికిబోయి గూర్చుండిరి. పారిపోయిన యా జూదరి కూడ నచ్చటనే యొక చెట్టెక్కి కూర్చుండెను. ఆ చెట్టుక్రింద తక్కిన జూదరులిద్దరు కొంతసేపు కూర్చుండిరి. ఏమియు తోచక యొక పందెమువైచుకొందమని జూదపుసారెలుదీసి యాశ జొచ్చిరి. ఈ జూదపుసారెలు చూడగనే చెట్టుమీదనున్న యా దొంగకు శరీర ముప్పొంగెను. ఆ పరవశత్వముచేత వాడు తన స్థితిగతులు తెలిసికొనలేక నీమారు పందెము నేను వైచెదనని చెట్టుమీదనుండి గభాలున నేలకు దిగెను. దొంగ దొరికినాడని వారు సంతోషించి వానిం బట్టుకొని మర్దించిరి.

ఎన్. చిన్నంరాజు

## ముసలివాని తెలివి

తక్షశిలలో ఊరివెలుపల ఒకముసలికాపువాడు తనయజమాని తనకు అప్పచెప్పిన తోటను కాపు కాస్తూండేవాడు. పూర్వం ఆతోట తన తాత ముత్తాతల పరంపరగా వస్తూ కారణము లేకుండా తన యజమానికి అప్పచెప్పేశారు. పాపం! ఈకాపు తనతాతలు తండ్రులు పెంచిన మామిడిచెట్లయొక్క ఫలములను అనుభవించుటచేత, ఆ విశ్వాసముమీద తన మనుమలుగూడ అనుభవించాలని చిన్న చిన్న మామిడి మొక్కలను పాతుచుండెను. ఆ వూరి రాజు గుఱ్ఱమెక్కి విహారార్థము ఆ దారంట పోతూ మొక్కలు నాటడము చూచి ముసలికాపుని పిల్చి వయస్సెంతని అడిగాడు. ముసలివాడు భయపడుతూ బొంగురుగొంతుకుతో ఎనభై సంవత్సరాలు అని చెప్పేడు. రాజు మళ్ళీ "మామిడిమొక్కలు పాతినవి ఎన్నాళ్లకి చెట్లవుతాయి? ఎప్పుడు అనుభవిస్తా"వని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు ఆకాపు "రాజా! ఈ మామిడిచెట్లనుండి వచ్చు ఫలములు నేను అనుభవించడానికి కాదు. నా మనుమలు, కొడుకులు అనుభవించడానికి. మీకెదురుగా నున్న ఆ మామిడిచెట్లు మాతండ్రులు, తాతలు నేననుభవించడానికిపెంచారు. వాటినుండి లభించు ఫలాల్ని కొన్ని అనుభవించాను అనుభవిస్తున్నాను" అని చెప్పేడు. రాజు ఆశ్చర్యంతో మంచిపాఠము నేర్పినందుకు బహుమానంగా వరాలసంచీ యిచ్చి రాజ్యానికి పోయేడు. కాపు సంతోషించాడు.

నేమాన సత్యనారాయణమూర్తి